# మూడవ అంతస్తు

### కావిలిపాటి విజయలక్ష్మి

"వీధిలో దీపముంచలేదేం?" అంటూ లోపలికి వచ్చిన మూర్తి నట్టింట్లో తల వంచుకుని గోడకు చేరబడి కూర్చున్న సుశీల వైపు చూసి, "ఏమిటిలా కూర్చున్నావ్. పొద్దుపోయింది. వీధి అందరి గడపల్లో దీపాలు వెలుగుతుంటె నువ్వూ!......" ఆగి వంచివున్న ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమె వెక్కిళ్ళ మీంచి జారే కన్నీరు, ముఖం పవిటచెంగుతో తుడుచుకుని దీర్ఘంగా నిట్టూర్పు వదిలి అలా మౌనంగా వుండిపోయింది.

అతను గ్రహించాడు కాని, ఆ ప్రసక్తి తేకూడదనీ, విస్మరించాలని ఏనాడో అనుకున్నాడు కనుక, "లే! దీపాలు వెలిగించు" అన్నాడు.

ఆమె తల అడ్డంగా ఊపింది దీపాలు వెలిగించనన్నట్లు.

"లే! ఒకటి రెండు దీపాలన్నా వెలిగించు" అంటూ, ఆ గదిని ఆనుకుని వున్న మేడమెట్ల వైపు నడిచాడు.

ఒకటి, రెండు అని పేలవంగా నవ్వి "రెండవ దీపం ఆరిపోయిందిగా, తోడు లేకపోతే ఈ దీపం వెలగనంటూంది" అంది సుశీల.

మేడ ఎక్కే రెండవ మెట్టుపైన కాలుంచిన మూర్తి అలానే నిల్చుని ఆమె వైపు చూసి, నీకు పిచ్చి పట్టిందిలా వుంది. పండగ కదా! అని గబగబా మేడమెట్లు ఎక్కి గదిలోకి వెళ్ళి ఈజీ చైర్లో పడుకుని పై స్లాబ్ వైపు చూశాడు.

అతను మహాసముద్రంలా గంభీరంగా, హుందాగా పైకి నటించినా, అతని మనస్సు కల్లోలితమౌతూనే వుంది. అతని హృదయాన్ని బడబాగ్ని కాలుస్తూనే వుంది.

తానేమన్నాడు? మెట్లెక్కుతూ, పండగ కదా! అని. ఆ మాట విన్న సుశీల ఏమనుకుని ఉంటుంది? తనను నిందిస్తుంది. హృదయం లేని మనిషంటుంది. అన్ని పండగలూ అందరికీ కావచ్చు. కాని, దీపావళి మాత్రం కాదు. ఇది ఎవర్ని ఏ విధంగా బలితీసుకుంటుందో! తన చిన్నతనంలో తానుండే పల్లెటూరిలో తాటాకు ఇళ్ళు ఎక్కువేమో ఏ మూలో కొంపలంటుకునేవి. మర్నాడు రచ్చబండ దగ్గర తగువు ధర్మాలు. ఇదీ ఆ పండగ సందడి.

ఈ రోజు గత సంవత్సరం, లేదా కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన దీపావళీ దివ్వెలు గుండెను కాల్చిన మంట చల్లారక, ఈ పండుగనే శపించి కన్నీరు కార్చేవారు. కొందరయితే జాగ్రత్త సుమా! బనీన్లు, చొక్కాలు విప్పెయ్యండి అని హెచ్చరికలు చేస్తూ, పిల్లల్ని కనిపెట్టుకుని తిరిగి పండగ జరిపించుకుని తేలిగ్గా అయిపోయింది పండగ అని ఊపిరి పీల్చి హాయిగా నిద్రపోయేవారు కొందరు.

ఒక్కో చోట మందుగుండు సామాన్లు తగులబడి పోతున్నాయ్. ఓ సంవత్సరం అయితే శ్రీకాకుళంలో మందుగుండు సామాన్లు నూరుతూ పటాస్ పేలి యూనివర్సిటీలో చదివే విద్యార్థులు ఇద్దరు అక్కడికక్కడే మరణిస్తే, ఓ అబ్బాయి మెట్లవరకూ పరుగుతీసి స్పృహ తప్పాడు. గదిలో వున్న అబ్బాయిలిద్దరిలో ఒకడు మసై గోడకు అంటుకుపోతే,ఇంకొకడి చేతులు రెండూ తెగి స్లాబ్‌కి అంటి వేళ్ళాడుతున్నాయిట.

ఎంత హృదయవిదారక దృశ్యం! అతని తల్లిదండ్రులకు గుండెమంటని చల్లని పానీయాలు ఆర్పలేవే, తనకు నలభై సంవత్సరాలు దాటాయి. ప్రమిదల్లో దీపాలు ప్రమాదం లేదు. తమది మూడు అంతస్తుల మేడ. అక్కడక్కడ అందంగా దీపాలుంచటం, దీపాలు పేర్చిన ఇళ్ళ వైపు చూడటం, చిచ్చుబుడ్లూ, మతాబులూ, విష్ణుచక్రాలు వెలగటం, చూడడం సుశీలకు చాలా ఇష్టం. కాపురానికి వచ్చిన కొత్తల్లో అయితే చిన్న అమ్మాయిలా బజారుకెళ్ళి తనకు కావాల్సినవన్నీ కొనుక్కుని తగ లేసేది. వాళ్ళ నాన్న ప్రత్యేకంగా, దీపావళి పండగ ముందు వచ్చి పండగకి రండి అని ఆహ్వానించేవాడు. రామంటే, కూతురికి చిన్న అమ్మాయికిలా మతాబులు కొనుక్కో అని డబ్బిచ్చి వెళ్ళేవాడు. అతనలా ప్రతి పండగకీ ఆహ్వానించటం తనకు నచ్చేదికాదు. దీపావళి పండగకి కూతురికి డబ్బిచ్చి వెళ్ళడం అస్సలు నచ్చేది కాదు. పెళ్ళయిన కొత్తల్లో పెద్దవాళ్ళు, వెళ్ళు బాగుం డదు, నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటారు. అని వత్తిడి తెస్తే రెండు, మూడుసార్లు వెళ్ళారేమో! తన కేమిటో ఈ పండుగ ఆర్భాటాలు చిన్నప్పటి నుండి నచ్చవు. తన తల్లి అంటూండేది అప్పుడప్పుడు, "ఏం రామ్మూర్తీ నువ్వు మరీ నాస్తికుడివై పోతున్నావూ!" అని.

రమణ పుట్టిన సంవత్సరం కాబోలు, కూతురికి సంబరంగా డబ్బులిస్తూ, "ఇదిగోనే సుశీ, ఇప్పటి నుంచి నీ కొడుక్కీ, నీకూ మతాబుల డబ్బులు" అన్నారు మావగారు.

తనకెందుకో గొప్ప చిరాకేసింది. పాతిక దాటిన కూతురికి మతాబులకి డబ్బులివ్వడమేమిటి? ఇతను పెద్దవాడే కాని బుద్ధి లేదు అనుకుంటున్నాడు.

"మావగారూ! మీ కూతురేం చిన్న పాపాయి కాదు మతాబులు కాల్చడానికి. అస్సలీ సంవత్సరం నుంచీ ఈ పండగ ఇంట్లో చెయ్యనివ్వను" అన్నారు ఉబికివచ్చే కోపాన్ని అణచుకుంటూ.

"అదేమిటి బాబూ..." అని అతనేమో అనబోయాడు. మరేం చెప్పవద్దు ప్లీజ్ అనేసి అక్కడి నుంచి వెళ్ళి పోయాడు.

మరో పది నిమిషాల తర్వాత వెళ్తున్నాను నాయనా! బాబూ జాగ్రత్త. అని చెప్పి వెళ్ళిపోయాడతను.

రాత్రి భోజనాలూ అవీ అయిన తర్వాత బాబుని జోకొట్టి నిద్ర పుచ్చుతూ అంది సుశీల. మీరు అలా అనకుండా వుండాల్సింది అని.

కావచ్చు కాని, నేనలా చెప్పేలా ప్రవర్తించిందాయనే. అని తానంటే, ఈ సంవత్సరం బాబు చూస్తాడు మతాబులు. ఏం మనిషో, పాడో ఏ సరదా లేదు, పైగా ఎదటివాళ్ళని చూసి రుసరుస లాడటం సహించలేని తనం అని సుశీల దురుసుగా అనడం, ఆ రోజు ఒక వాగ్యుద్ధమయింది ఇద్దరిమధ్యా. చూడండి ఇప్పటి నుంచి నే మతాబులు కాలుస్తానేమో! అని ఏడ్చేసింది సుశీల.

ఈ చిన్న విషయానికి తననెంతో గౌరవంగా, ప్రేమగా చూసే మామగార్ని, సుశీలని ఒప్పించాను అని బాధపడ్డాడు తర్వాత.

పట్టుదలగా రెండు మూడేళ్ళు మతాబులు కాల్చ లేదు సుశీల. రమణగాడు, వెలిగే దీపాల్ని ఎదరింటి వాళ్ళు కాల్చే మతాబుల్నీ చూసి చప్పట్లు చరిచి నవ్వడం చూసి తనే మతాబులు కొని బలవంతంగా సుశీలచేత కాల్పించాడు. మామగారు ఆ నాటి నుంచి కూతురికి డబ్బులివ్వడం మానేశారు.


తనకంత ఇష్టం కాకపోయినా సుశీల రమణ ఆనందం కోసం పదిహేను రూపాయిల దీపావళి సామాన్లు తెచ్చేవాడు. రమణకు ఏడు సంవత్సరాలు నిండాక నాని

పుట్టాడు. తండ్రి పేరు పెట్టుకుంది కనుక, ముద్దుగా సుశీల వాణ్ణి నానీ అని పిలిచేది. అదే వాడి నామధేయమై పోయింది. రమణ నెమ్మదస్తుడు, భయస్తుడు. కాని, నాని చురుకు, తెలివే కాక, దబాయింపు, గలగలా మాట్లా డుతూ ఇల్లంతా తిరుగుతూ ఒకటే సందడి.

గత సంవత్సరం నానిగాడు.... కనులు గట్టిగా మూసు కుని బరువుగా ఊపిరి పీల్చి వదిలాడు మూర్తి.

* * *

గత సంవత్సర దీపావళి తాలూకు స్మృతులు ఒక్కొ-



క్కటే కన్నీటి బొట్లుగా మారుతుంటే, శోకదేవతలా కూర్చుంది సుశీల.

గత సంవత్సరం—

''అమ్మా ఇవ్వాళ నాన్నగారు తెచ్చిన కొత్తబట్టలేసు కుంటాను'' అన్నాడు నాని.

''ఫుల్ ఫాంటు షర్టు. ఏమీ కాల్చగూడదు సుమా!'' హెచ్చరించింది సుశీల.

''అలాగే పగలు కాల్చుకుంటామేమిటి చిచ్చుబుడ్లవీను'' అన్నాడు నాని. కొత్త బట్టలేసుకుని సంతోషంగా ''అమ్మా నాకు పది సంవత్సరాలు నిండాయి కదా నేను పెద వాణ్ణే. చూడు ఎంత బాగున్నానో, ఇటుపైన అన్నీ ఫుల్ ఫాంటులే కుట్టించాలి'' అన్నాడు నాని.

''అలాగే, మహా పెద్దాడివై పోయావు కాని...'' అని వాడి బుగ్గలు ముద్దు పెట్టుకుని జాగ్రత్త నాన్నా! అని మరోసారి హెచ్చరించింది సుశీల.

మూడవ అంతస్తు డాబా మీద దీపావళి సామాన్లు ఎండలో పేరుస్తూ, ''అన్నయ్యా నాన్నగారు పిసినారి. రామం వాళ్ళ నాన్నగారు ఇంకా, విస్సు, రాజు, శేఖరూ వాళ్ళందరి నాన్నగార్లు చేతులు చాపి చూపిస్తూ ఇవన్ని బోలెడన్ని తెచ్చారు. మన ఎదరింటి రమణిగారు చూడు ఎన్ని సామాన్లుతయారు చేసుకుంటున్నారో! మన నాన్న గారెప్పుడూ ఇంతే..ఛీ..'' అన్నాడు నాని.

కొడుకులిద్దరివైపూ ముచ్చటగా చూస్తున్న సుశీల ''తప్పు బాబూ! నాన్నగార్ని అలా అనకూడదు'' అంది.

'నాన్నగారు పిసినారి' అన్నాడు నాని.ఆ మాట ఖరారు చేస్తున్నట్టు చెయ్యి వూపుతూ.

సుశీలా, రమణా ఇద్దరూ నవ్వారు. నాని మాట యాక్షన్ చూసి.

''అన్నీ నువ్వే కాల్చరా నానీ!'' అన్నాడు రమణ.

''నాన్నగారికి చెప్పొద్దు కాని డబ్బులిస్తాను. వీడికింకేం కావాలో కొనరా రమణా'' అంది సుశీల.

''నాన్నగారికి తెలియకుండానా?'' కళ్ళు వెడల్పుచేసి తల్లివైపు ఆశ్చర్యంగా చూశాడు రమణ.

''అవును, ఆయన్ని ఇంకేమన్నా కొనితెండి అంటే పెద్ద రభస చేస్తారు బాబూ! డబ్బులిస్తాను. గమ్మున వాణ్ణి తీసుకుని వెళ్ళు. వాడికి కావాల్సినవన్నీ కొనెయ్'' అంది సుశీల.

నాన్నగారికి తెలియకుండా అని ఏదో సందేహం వచ్చింది. కాని మళ్ళీ అమ్మకి తాతగారు డబ్బులిచ్చి ఉంటారు అనుకుని తల్లి చెప్పినట్టుగానే నానికి కావల

సిన సామాన్లు కొన్నాడు రమణ.

నాని సంతోషం అంతా ఇంతా కాదు. ఎప్పుడు సాయంత్రం అవుతుందా అని చాలా ఉషారుగా ఉన్నాడు.

సాయంత్రం ఆ పట్టణ దీపాలు వెలిగే వేళ మూడవ అంతస్తు డాబాపైకి వెళ్ళి నిలుచుంది సుశీల. ఊరు నక్షత్ర మండలంలా ఉంది. యారాడ కొండ లైట్‌హౌస్, సిగ్నల్ దీపం, సముద్ర మధ్యంలో ఆగి నడుస్తున్న ఓ దీపాలు పేర్చిన చిన్ని చిన్ని కొండల్లా స్టీమర్లు, దీపాలు వెలిగే వేళ పట్టణ సౌందర్యాన్ని చూసి మెచ్చుకుని ఆనందించే అలవాటున్న సుశీల విశాఖ విస్తరించటమే కాక, కొండలెక్కిపోతూంది అనుకున్న ఆమె పెదవులపై చిరునవ్వు కదిలింది.

అమ్మా నాన్నగారు వచ్చేశారు, నానిగాడి గొంతు ఎందుకో తృళ్ళిపడినట్టు కదిలి గబగబా మెట్లుదిగి క్రిందికి వచ్చేసింది సుశీల.

"సుశీ! లేటయినట్టున్నాను. నా కోసం వెయిట్ చేస్తున్నారులా వుంది. ఊ..కానియ్యండి పండగ. వెధవ గవరయ్య షావుకారు వద్దంటుంటే వెలాఖరుకివ్వండి అంటూ అదిగో వైర్‌బాగ్‌లో ఏవో ఇచ్చాడు తగలెయ్యండి"- అన్నాడు గబగబా మూర్తి బట్టలు మార్చుకుంటూ.

"అబ్బో బోలెడు హోయ్ హోయ్ రా..రా..అన్నయ్యా" నాని సంతోషంగా మూర్తి తెచ్చిన సామాన్లన్నీ వెతికి, ఇవి అన్నయ్యకీ, ఇవి అమ్మకీ, ఇవి నాకూ అని వాటాలు వేసేశాడు.

వెధవ వెధవ సరదాలు అని తిట్టుకుంటూ, వాకిట్లోకి నడిచి నాలుగు చెంబులు నీళ్ళతో కాళ్ళూ చేతులూ, ముఖం కడిగేసుకుని, దేవుడి గదిలో సుశీల వెలిగించిన మైనపువత్తితో గుగ్గిలం వేసి, గిరుక్కున వెనక్కి తిరగి వెళ్ళిపోతూన్న మూర్తి తులసెమ్మ దగ్గరో అన్న సుశీల మాట వినిపించుకోలేదు.

అతని అకారణ కోపానికి తానూ కోపగించుకున్న సుశీల అతన్ని లక్ష్యపెట్టదలుచుకోలేదు. "రా రా..రమణా! రా రా నానీ" అని పిల్లల్ని పిలిచి వీధి గడపలో పిల్లలు సరదాబడ్డ చిచ్చుబుడ్లూ, మతాబులూ అన్నీ కాల్పించి ఆనందించింది. మూర్తి వీధి గడపలో పిల్లలు సరదాపడ్డ చిచ్చుబడ్లు అన్నీ కాల్పించి ఆనందించింది. మూర్తి వీధి గడపవైపే రాలేదు.


## "పిడికిలి"

అలాగే మూసి వుంచు
నీ పిడికిలిని
తెర నకు పొరపాటున
అది నీ ధైర్యానికి ఊత
నమ్మకానికి చేయూత
అందుకే అలాగే మూసి వుంచు
నీ గుప్పెడు పిడికిలిని
అది నీ స్థిర నిర్ణయం
అదే నీ పట్టుదల చిహ్నం
నీ బ్రతుక్కి ఆధారం
నేటి యువతకు ఆదర్శం
రేపటి జాతి ప్రతిబింబం

-అడుసుమల్లి ప్రభాకర్

నానీ, నానీ అని సుశీల పిలుస్తున్నా వినిపించుకోకుండా నాన్నగారికి ఇది వెలిగించి చూపిస్తా అని మూర్తి గదిలోకి పరుగుతీశాడు నాని.

అయిదు నిమిషాలయిందో లేదో, నాని ఏడుపు.




వెధవా చావు అని మూర్తి గొంతు. ఛెళ్ళు ఛెళ్ళున దెబ్బల చప్పుడు.

సుశీల అటువైపు పరుగెత్తి గుమ్మం తన్నుకుని పడి లేచి, గుప్పిటతో నాని క్రాపు పట్టుకున్న మూర్తి చెయ్యి వెనక్కి తోస్తూ" చాల్లెండి. పిల్లల్ని కొట్టడం మాత్రం బాగా తెల్సు" అంది రుద్ధస్వరంతో. కందిన నాని చెంపలు చూసిన ఆమె కడుపు చెరువై పోయింది. ఏం చేశాడని అంతలా కొట్టుకోవడం? మూర్తి ముఖంలోకి రోషంగా చూస్తూ ప్రశ్నించింది సుశీల. నాని ముఖం మృదువుగా పవిటచెంగుతో వత్తి, "ఊరుకో బాబూ! మన ఖర్మ" అని

"సిసిందీ్రి వెలిగించి నా పంచెలోకి వదిలాడు వెధవ" పళ్ళు కొరికాడు మూర్తి.

"వాడు కావాలని చేసింది కాదు నాన్నగారూ. సిసిందీ్రి కదా!" అని రమణ మాట పూర్తిచేశాడో లేదో రమణ చెంప ఛెళ్ళుమంది.

"ఏమండీ! మీకు దెయ్యం పట్టిందా?" అరిచింది సుశీల.

"ఏమిటి రాస్కెల్ వాగుతున్నావ్?" అతని లోని మొగుణ్ణి మగాణ్ణి అనే అహంకారం రెచ్చగొట్టడంతో బుద్ధి నశించి.

"ఆ దెయ్యమే పట్టిందే! నీకు దీపావళి పండగ దెయ్యం పట్టలా, అలానే నాకు ఈ పండగ ఇంట్లో మాన్పించాలని" అంటూ సుశీల జడ పట్టి గుంచి, ఆమె మీద చెయ్యి చేసుకున్నాడు మూర్తి.

తల్లిని తండ్రి దండించడం చూడలేని రమణ దోసిట్లో ముఖం దాచుకున్నాడు.

"అమ్మని కొట్టకండి నాన్నగారూ! నేనింకెప్పుడూ దీపావళి సామాన్లు కాల్చను. ఇంకెప్పుడూ మతాబులు కొనమని అడగను. ఎప్పుడూ సిసిందీ్రిలు కాల్చను. అమ్మని కొట్టకండి నాన్నగారూ! అస్సలు నేను దీపావళి పండగ చూడనే చూడను. దేవుడి మీద ఒట్టు" అని ఏడ్చే నానిని, "వెధవా! అరవకు చంపేస్తాను" చెంప అదిరేలా కొట్టాడు మూర్తి.

అన్నాళ ఆ ఇంట్లో బీభత్సవాతావరణ ములుముకుని అశాంతి రేగి, నిశ్శబ్దమయింది.

భోజనాలు లేవు, దీపాలు ఆరాయి. పిల్లలూ, పెద్దలూ చెదిరిన మనసూ, బెదిరిన హృదయం, మూర్తి అయితే అస్సలు నిద్ర పోనే లేదు. పిల్లలు వెక్కివెక్కి ఏడ్చి అలసి నిద్రలోకొరిగారు. తల్లిని కావలించుకు పడుకున్న నాని కుమిలి కుమిలి ఏడ్చే తల్లి చెవిలో, "నానుంచే కదమ్మా నువ్వు దెబ్బలుతిన్నావ్! నేను మరి దీపావళి చూడనుగా!" అన్నాడు తల్లి చెవిలో గుసగుసగా.

కొడుకుని దగ్గరగా తీసుకుని తల నిమిరింది సుశీల. 'ఎప్పుడూలేదు. ఛీ ఏమిటిలా జరగింది పండగ!' అనుకుంది.

ముందుగా మెలకువ వచ్చింది మూర్తికే. అలసి ముఖాలు వాడి నిద్రపోతూన్న భార్యా పిల్లలవైపు చూశాడు. పశ్చాత్తాపం, జాలి. వీళ్ళు తాను కొడితే కొడతారా? తిడితే తిడతారా? ఛీ. ఉత్త పశువులా ప్రవర్తించాను. తనను తానే తిట్టుకుని టైము అరు

దాటుతున్నా సుశీలను లేపలేని సిగ్గుతో బాత్‌రూమ్‌వైపు నడిచాడు.

మరో ఐదారు నిమిషాలు తర్వాత మెలకువ వచ్చిన సుశీల, మూర్తి బ్రష్‌చేసుకుంటున్న అలికిడి గ్రహించి స్టౌ వెలిగించి గబగబా కాఫీ కలిపింది.

కాఫీ గ్లాసు చేతికి అందిస్తున్న సుశీల ముఖంలోకి చూశాడు మూర్తి.

ఆమె కనురెప్పలు ఉబ్బి వున్నాయి. అంతే. అసలు రాత్రేమీ జరగనట్లే పిల్లల్ని లేపి చకచకా ఇంటిపనుల్లో లీనమయిపోయిన ఆమె ప్రవర్తన మూర్తికి ఆశ్చర్యం కలిగించింది. అది పెద్దింటి పిల్లరా! అని తల్లి ఏనాడో అన్నమాట గుర్తువచ్చింది. రమణ, నాని అసలు మూర్తి వైపు రాలేదు, మాట్లాడలేదు.

టిఫిన్ ప్లేటు సుశీల చేతిలోంచి తీసుకుంటూ అన్నాడు మూర్తి. "సారీ. ఎక్స్‌క్యూజ్‌మీ సుశీ! పిచ్చి కోపంలో అదుపుతప్పి నిన్నూ, పిల్లల్నీ..."అని.

"పర్లేదులెండి" అని తేలిగ్గా నవ్వేసింది సుశీల.

మళ్ళీ రోజులు సాఫీగా జరిగిపోతున్నాయి.

* * *

అవ్వాళ ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల వేళ, లెక్కలు చేసుకుంటున్న వాడల్లా లేచి "అన్నయ్యా ఫ్రెండింటికెళ్ళి నోట్స్ తెచ్చుకుంటానురా" అని కాలికి చెప్పులన్నా వేసుకోకుండా వీధిలోకి తుర్రుమన్నాడు నాని.

సాయంత్రం ఆరయింది. నానిగాడు ఇంటికి రాలేదు. ఇంకా రాలేదు. వీడేమయ్యాడు? అనే ప్రశ్న ఆ తల్లిదండ్రుల హృదయాల్ని కలవరపెట్టింది. ఆ వీధి చివర వారింట్లో టి.వి. చూస్తూ అప్పుడప్పుడు ఆలశ్యంగా ఇంటికి వచ్చే అలవాటుంది నానికి. అక్కడికే వెళ్ళి వుంటాడు అని సరిపెట్టుకున్నారు కాస్సేపు.

"వాళ్ళింట్లో వున్నాడేమో! చూసిరారా రమణా" అని రమణని పంపించారు.

ఐదారు నిమిషాల్లోనే, లేడు అని కబురు తెచ్చాడు రమణ.

ఎక్కడికి వెళ్ళి వుంటాడు? అనుకుంటూనే బట్టలు మార్చుకున్నాడు మూర్తి.

రమణ, మూర్తి రోడ్డెక్కారు. నాని ఫ్రెండ్సిందరిళ్ళకో వెళ్ళారు.

"సాయంత్రం బీచ్‌లో ఎవరో పిల్లలతో బంతి ఆడడం చూశామండీ!" అని ఒకాయన చెబితే, 'ఎవరాపిల్లలు?' అనే ప్రశ్నకు సరియైన జవాబులేదు.

నాని ఇంటికి రాలేదు. 'ఏమయ్యాడు? సముద్రంలో పడ్డాడా? ఎవరన్నా ఎత్తుకుపోయారా? ఎక్కడున్నావురా బాబూ! ఆకలికి ఆగలేని నీకు ఎవరు అన్నం పెట్టారురా!' మాతృమూర్తి హృదయంలో హాలాహల జ్వాలలు. వాణ్ణి వెంటనే చూసెయ్యాలి. వాడింటికి రాక పోతే ఈ శోకాన్ని భరిస్తూ భగవంతుడా తాను జీవించలేదు.

వీధివీధులూ తిరిగి నిస్పృహతో ఇల్లు చేరిన మూర్తి హృదయం కల్లోలిత సముద్రమే అయింది. రమణ చేష్టలుదక్కిన శిలా విగ్రహంలా, ఈ హఠాత్

# పుష్పక వృక్షం

నా హృదయం
పుష్పక విమానం
ఎందరికయినా చోటుంటుందులో
ఇంతవరకూ ఉన్నవారికెంతమాత్రమూ
ఇరుకు కలక్కుండా

నా హృదయం
నిత్యం కొత్త చిగుళ్ళు తొడిగే
సతత హరిత వృక్షం
నా హృదయం
పుష్పక వృక్షం.

-మానేపల్లి సత్యనారాయణ

పరిణామానికి మూగబోయి, బిత్తర చూపులు చూస్తూ కన్నీరు విడుస్తున్నాడు.

ఆ రాత్రి శివరాత్రి, వారి కుటుంబానికే కాదు ఆ వీధి అందరికీ.

మర్నాడు మళ్ళీ గాలింపు. పోలీసు రిపోర్టు, ఫోటో పేపర్లో వేయించే కార్యక్రమం జరిగాయి. నాని జాడ లేదు.

యారాడకొండ, ఊరు, దుర్గగుడి, ఫ్రెండ్సును తీసుకుని పిచ్చివాడిలా, జత వీడిన పక్షిలా విలవిలలాడుతూ తిరిగాడు రమణ. కాళ్ళుపీకుతున్నాయి. ఏం తింటున్నాడో, ఏం తాగుతున్నాడో, నీర్సం.



బంధువులు, స్నేహితులు, పరిచయస్థుల పరామర్శలతో రాకపోకలతో ఇల్లు తీర్థ మయింది. సుశీల కంటనీరు కట్టలేదు. మూర్తి మూడవ నాటికి ముసలివాడయి మతిచలించిన వాడిలా అయిపోయాడు.

పుత్ర వియోగం అదీ కనుపించకుండా పోవడం, ఆ బాధ, వేదనా మరణయాతనకన్నా వెయ్యిరెట్లు ఎక్కువేమో!

అందిన వార్తలు. కాస్సేపునాని బీచ్‌లో బంతాట ఆడాడు, ఆ తర్వాత బోటులో ఒక్కడే దుర్గ గుడికి వెళ్ళాడు. విభూది, తీర్థం, కుంకుమ తీసుకున్నాడు. రెండు మూడు నిమిషాలు కూర్చుని వెళ్ళిపోయాడు. తర్వాత ఎటువెళ్ళిందీ, ఎక్కడికి వెళ్ళిందీ ఎవరికీ తెలియదు.

మూడవరోజుమధ్యాహ్నం, ఆ ఇంటి శోకంలానే బయట వర్షం, ఈదురుగాలులు, చీదర. విశాఖ టౌనులో వర్షం కురిసిందంటె సైడుకాలువలు రోడ్లని ముద్దెట్టుకుంటాయేమో! టౌను పాయఖానా అవుతుంది. అదీ కొన్ని ఇరుకు వీధులయితే మరీ చండాలంగా వుంటాయి.

అయినా మూర్తి ఇంటికి జనం ఎడతెరిపి లేకుండా వచ్చిపోతూనే వున్నారు.

ఇరుగుపొరుగు ఆ భార్యాభర్తలకు నచ్చచెప్పి వేదాంత బోధచేసి నాలుగు మెతుకులు కతికించారు.

"మూర్తిగారిది ఈ ఇల్లేనాండి? ఈ ఇంట్లో అబ్బాయే నాండి? తప్పిపోయింది?" అని ప్రశ్నిస్తూ ఇద్దరు అబ్బాయిలు ఇంట్లోకి వచ్చారు.

"అవును, మా అబ్బాయే ఎక్కడున్నాడు?" వంటేని, మనస్సుని కృంగదీస్తున్న నీర్సమంతా పోయి ఏనుగంతబలం వచ్చినట్లు భార్యాభర్త లిద్దరూ ఒకేసారి ప్రశ్నిస్తూ లేచి నిల్చున్నారు.

ఎక్కడున్నాడో చెప్పడానికి తికమకపడ్డ అబ్బాయిలు

"బయట ఎస్సైగారున్నారండి" అన్నారు.

"నాయినా దొరికావురా, సుశీ పోలీసులకు దొరికాడే మనవాడు" అని పరుగులాంటి నడకతో వీధిలోకి నడిచాడు మూర్తి. గుండె నిండుగా పండగవుతూంటె అతన్ని అనుసరించింది సుశీల.

ఎస్సై చెప్పిన వివరాలు వినేసరికి సుశీల గుండె పండుగ బాజాలు ఆగాయి. బడబాగ్ని జ్వాలలు రేగాయి.

ఆటోలు బీచ్‌రోడ్డువైపు పరుగులు తీశాయి.

అంత వర్షంలోనూ, అక్కడ తీర్థంలా ప్రజలు.

"నేను చూడలేను, చూడలేనూ!" అప్పటిదాకా వానిగాణ్ణి చూడాలని తపించిపోయిన మూర్తి అరుస్తూ రోదిస్తున్నాడు. అతన్ని పట్టలేకపోతున్నారు.

అరిచరిచి అతను మూర్ఛపోయాడు.

"మీ అబ్బాయి అవునో, కాదో చూసి చెప్పండమ్మా అంతే!" అన్నాడు ఎస్సై సుశీలని.

అటువైపు అడుగులు వేసిందా శోకమూర్తి.

పదవ నెంబరు జెట్టీ దగ్గర జనం గుమిగూడారు.

కడలి కడుపున తన కొడుకు. అంతిమ క్షణాల్లో, దుర్గతీర్థం తీసుకుని అమరుడయిపోయిన బాలుడు. గట్టిగా కనులు మూసుకుని బరువుగా ఊపిరి పీల్చి వదిలింది సుశీల గుండె పగులకుండా స్థిరపరుచుకుంటున్నట్లు.

కనులు విప్పి తల వంచి చూసింది. నీటిలో చూపులు మసకబారడంతో కనులు పవిటచెంగుతో తుడుచుకుంది.

కదలని కడలి నీటిలో, చేపలు చర్మం తినేసి బోర్లాపడి చేతులూ, కాళ్ళూ చాపిన అస్థిపంజరం.



నిక్కరు, మొలకు బిగించిన బెల్టు, చారల చొక్కా ఆరోజు వాడు వేసుకువెళ్ళినవే.

ఎస్సై ఏవో ప్రశ్నలు వేస్తూ, ముందుకి ఉరకబోయిన సుశీల చెయ్యిపట్టి ఆపుతూ, "నేనూ మీలాంటి నష్టజాతకుణ్ణే తల్లీ!" అని తను అశ్రద్ధగా వదిలిన పిస్టల్ పేలి మరణించిన తన కొడుకు కథ చెప్పి, "జీవితంలో మరి కష్టసుఖాలుంటాయ్" అన్నాడు.

వానిగాడి పోస్టుమార్టం రిపోర్టు హార్ట్ ఫెయిల్యూర్.

"దుర్గతీర్థం తర్వాత సముద్రపు నీరు మింగలేదు. ధన్యుడు. చిన్నవాడైనా మరణం గొప్పది, మోక్షం పొందుతాడు" అన్నారెవరో.

అయిపోయింది వానిగాడి జీవితం......ముగిసిపోయాయి నా ముచ్చటలు.

వానిగాడు ఆ నాడన్న మాటలు..."మరి దీపావళి నేను చూడనుగా, దేవుడి మీద ఒట్టు" ఆ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి సుశీలకు.

రమణ ముభావంగా, గంభీరంగా వుండిపోయాడు.

మరి దీపాలు వెలిగించు అనలేదు మూర్తి. తొమ్మిది దాటాక సుశీలా, రమణా మౌనంగా కూర్చున్న దగ్గర కొచ్చి, ఆ భరించలేని నిశ్శబ్దాన్ని కదిలించాలని అన్నాడు.

"లే సుశీ! అన్నాలు తిందాం. ఏ పాటు తప్పినా సాపాటు తప్పదుగా!" అన్నాడు నవ్వుతూ.

లేచి వంటఇంటి వైపు నడిచింది సుశీల. ఆరోజు పిండివంటలు లేవాఇంట్లో.

"మూడవ అంతస్తు ధూళిగా వుంది తుడిపించావా?" అడిగాడు మూర్తి సుశీలని.

"అమ్మ మూడవ అంతస్తుకి వెళ్ళదు సముద్రం కనిపిస్తుందని" జవాబిచ్చాడు రమణ.

తన కొడుకుని మింగిన కడలిని చూస్తే ఆమె శరీరం, మనసూ అంతా బడబాగ్ని మంటలే. ఆమెలో కసి రేగుతుంది. కనులు నీటికడవలవుతాయి. అందుకని తమ ఇంటి మూడవ అంతస్తు నుంచి కుడివైపుకు చూస్తే యారాడకొండ, విరిగిపడే కడలి అలలు. ఆమె ఆ అంతస్తుకు వెళ్ళదు. అటు చూడదు.


దీపావళి శుభాకాంక్షలతో

వివాహాది శుభకార్యములకు, పండుగలకు

శ్రీ విజయా స్టూడియో

కంప్యూటరైజ్డ్ కలర్ లాబ్ సదుపాయముతో

ఏలూర్ రోడ్ సెంటర్,

విజయవాడ—2

ఫోన్: 63774

ఉషా కలర్ లాబ్

కంప్యూటరైజ్డ్ కలర్ లాబ్ సదుపాయముతో

నాజ్ సెంటర్.

గుంటూరు.

P.P. 22629

గ్రేస్ కలర్ లాబ్

కంప్యూటరైజ్డ్ కలర్ లాబ్ సదుపాయముతో

S.R.M.T.ఎదురుగా,

కాకినాడ

విశాఖ కలర్ లాబ్

కంప్యూటరైజ్డ్ కలర్ లాబ్ సదుపాయముతో

ఉమర్ ఖయ్యాం బార్ ప్రక్కన, డాబా గార్డెన్స్,

విశాఖపట్టణం.

FRINDS